‘ముత్తుముల’ను కలిసిన విశ్వబ్రాహ్మణ సేవా సంఘం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడిపి ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డిని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండల విశ్వ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు బంగారు శ్రీనివాసాచారి, రాచర్ల మండల అధ్యక్షులు వడ్ల వీరయ్యాచారి, మరియు సంఘం నాయకులు నీలోజీ సురభయ్య, ఎం.నాగబ్రహ్మం, బి.రత్నమాచారి, వీర బ్రహ్మాచారి, డి గోవిందయ్య, ఎం నాగ బ్రహ్మాచారి, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

స్వచ్ఛమైన తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - దొనకొండ: స్వచ్ఛమైన తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ పేర్కొన్నారు. స్థానిక వీవీపురంలో ఐటీసీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన నూతన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎంపీపీ, సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను గ్రామస్తులు చక్కగా వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల కోఆప్టెడ్ సభ్యులు షేక్.గఫార్, ఎంపీటీసీ గుంటు అమ్మాజీ అజయ్, వైసీపీ నాయకులు జొన్నకూటి సుబ్బారెడ్డి, షేక్.సలీమ్, రసూల్, వార్డు సభ్యులు బొందల రాజు, భట్టు వెంకటేశ్వర్లు, రామారావు, గురవయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య
- వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి
- యర్రగొండపాలెంలో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ

మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

పూలసుబ్బయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య

పాటలు పాడుతున్న ప్రజానాట్యమండలి కళాకారులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం :
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. కార్పొరేట్ అనుకూల మోడీని గద్దె దింపుదాం అంటూ కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అయినా, నేటికీ చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలిపారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టి నిరుద్యోగులను పెంచుతుం దని తెలిపారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి పేదల అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇంతవరకు హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశ సంపదను అంబానీ, ఆదాని లాంటి బడా పెట్టుబడిదారులకు దోచి పెడుతూ పేదలపై భారాలు వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని, కార్మికులకు అమలౌతున్న 44 చట్టాలను మార్చి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లు తీసుకుని వచ్చి కార్మికులను కట్టుబానిసలుగా తయారు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం బిజెపి ఏమి చెబితే అది అక్షరాలా అమలు చేస్తూ ప్రజలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. విద్యుత్ సవరణ చట్టం నూతన విద్యా విధానం లాంటి అనేక కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేస్తున్నారని తెలిపారు రాష్ట్రానికి రావలసిన నిధులు ప్రత్యేక హెూదా, పోలవరం, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం, నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కడప స్టీల్ ప్లాంట్ రైల్వే జోన్ లాంటి వాటిని రాబట్టడంలో జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ నెల 30 వరకూ బీజేపీని గద్దె దింపుదాం అంటూ ప్రచారభేరిని జయప్రదం చేయాలని కోరారు. మోడీ పాలనలో కార్పొరేట్ అనుకూలంగా కార్పొరేట్ శక్తులకు దాసోహమై ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నల్ల డబ్బులు తెచ్చి ప్రతి ఒక్కరి కుటుంబ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పి తీరా ఇప్పుడు అదానీ అంబానీలకు దాసోహమై దేశాన్ని తాకట్టు పెట్టే ప్రక్రియ సాగుతుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం ఆగదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసానికి గురిచేసిందని విమర్శించారు. ప్రజలను మభ్యపెడుతూ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పేద ప్రజలను, నిరుద్యోగులను, రైతులను అన్ని రకాలుగా దగా చేసింది జగన్ అన్నారు. ఈ ప్రాంతంలో రైతులకు ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును గాలికి వదిలేసి తీరా ఇప్పుడు త్వరలోనే పూర్తి చేస్తామంటూ కల్లబొల్లి మాటలు చెబుతూ మా నమ్మకం నువ్వే అని ఇంటింటా తిరుగుతున్నారని విమర్శించారు. స్థానిక మంత్రి ఆదిమూలపు సురేష్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దళితులకు చంద్రబాబు నాయుడు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తూ యర్రగొండపాలెంలో తన కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి చంద్రబాబు దళితులకు క్షమాపణ చెప్పాల్సిందే అంటూ మిస్ సిగ్గుగా చొక్కాలు విప్పితే పేదలకు ఏం ప్రయోజనం ఉంటుందని ఆరోపించారు. ఇలాంటి డ్రామాలు సరి కాదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో దళితులపై హత్యలు, దారుణాలు, మరణ హెూమాలు జరిగితే ఈ మంత్రి అప్పుడు ఎక్కడికి వెళ్లాడని విమర్శించారు. స్థానిక సమస్యలపై పరిష్కరించాల్సిన మంత్రి పదవిని కాపాడుకునేందుకే ఇలాంటి డ్రామాలకు తెరతీసారని ఆరోపించారు .కమ్యూనిస్టులు వాస్తవాలు తెలుసుకొని ఇలాంటి బూర్జువా పార్టీలను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు .నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉండగా ఇరు పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను చిత్తశుద్ధి ఉంటే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి అయిన సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని అన్నారు. కేవలం 100 కోట్లు కేటాయించిన ప్రభుత్వం అక్టోబర్ నెలకి వెలిగొండను పూర్తి చేస్తాం అనడం హాస్యాస్పదం అన్నారు. వెంటనే 2000 కోట్లను కేటాయించి యుద్ధ ప్రాతిపదికన సకాలంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని వెనుకబడిన మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించి, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి శాశ్వతంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జిల్లాలోని పేదలు స్థానికంగా పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళుతూ జీవనంసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు అవినీతిమయం చేశాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి పేదలకు స్థానికంగా జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా పూల సుబ్బయ్య విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో సీపీయం రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ జాలి అంజయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీయం నియోజకవర్గ ఇన్చార్జి షేక్ రఫి, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాథం, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, దోర్నాల మండల కార్యదర్శి పి.తిరుమలయ్య, గుంటూరు శ్రీను, నక్కా తిరుపతయ్య, వై.వెంకట శివయ్య, 5 మండలాల సీపీఐ, సీపీయం కార్యదర్శులు, నాయకులు,పార్టీ సానుభూతి పరులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు

వరికూటికి తల్లిదండ్రుల ప్రశంసలు

విశాలాంధ్ర - శింగరాయకొండ : పరీక్షకు వచ్చిన విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేసి తల్లిదండ్రుల నుండి మంచి ప్రశంసలు పొందారు కొండెపి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు. శింగరాయకొండలోని గురుకుల పాఠశాలలో సీటు పొందేందుకు పలు ప్రాంతాలనుండి పరీక్ష నిమిత్తం వందలాదిగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం ఇక్కడకు చేరుకున్నారు. పరీక్ష నిర్వహణ మినహా ఊరికి దూరంగా ఉండటం వలన ఇక్కడ కనీస వసతులు, ఏర్పాట్లు ఏమీ లభించవు. గత సంవత్సరం కూడా పరీక్షకు వచ్చిన విద్యార్ధులు, తల్లిదండ్రులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఇది తెలుసుకున్న వరికూటి వారికి భోజనం, మంచినీటి వసతి ఏర్పాట్లను స్వయంగా ఏర్పాటు చేశారు. మొత్తం 1400 మంది ఈఏర్పాటు వలన సౌకర్యం పొందారు. వరికూటి వాలంటీర్లు దగ్గరుండి ప్రతి ఒక్కరికీ భోజనం అందేలా ఏర్పాట్లు చేశారు. ఇది తల్లిదండ్రులనుండి మంచి ప్రశంసలు పొందేలా చేసింది.

ఈపరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5వతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఈపరీక్షలు నిర్వహించారు. ఉదయం పది నుండి 12 గంటల వరకు ఐదోతరగతి ప్రవేశపరీక్ష జరిగింది. ఈపరీక్షకు 406మంది హాజరు కావాల్సి ఉండగా 363 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటలనుండి నాలుగున్నర గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పరీక్ష నిర్వహించారు. 418 మందికి గాను 372మంది పరీక్షకు హాజరయ్యారు. 5వతరగతిలో 80మందికి, ఇంటర్మీడియట్‌లో 80మందికి ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ జయలక్ష్మి తెలిపారు.

వైసీపీ జండా ఆవిష్కరించిన వరికూటి

విశాలాంధ్ర-సింగరాయకొండ : శానంపూడి గ్రామం యస్.సి.కాలనీలో ఆదివారం కొండేపి నియోజకవర్గ ఇన్చార్జ్ వరుకుటి అశోక్‌బాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను అభిమానుల మధ్య ఆవిష్కరించారు. పొలిమేరలనుండి ఎదురెళ్ళి మేళతాళాలతో వర్కుటికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మయ్య సచివాలయం కన్వీనర్లు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం - పంటలకు నష్టం

ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వర్షం పడటంతో జిల్లాలో కొన్ని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర వెండ వేడి గాలులతో ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు దర్శి, యర్రగొండపాలెం, కనిగిరి, అద్దంకి నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం నమోదైంది. దీంతో మిర్చి, అరటి తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మిర్చి రైతులు మిరపకాయలను కోసం ఎండకు కల్లాల్లో ఎండబెట్టారు. ఆదివారం సాయంత్రం అనుకోకుండా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో కల్లాల్లో ఉన్న మిర్చి తడిసి ముద్దయింది. మరోక్క పశ్చిమ ప్రాంతంలో ఈదురు గాలులకు నేలకొరిగాయి. గత వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఎండలు ఎక్కువగా కాస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీ లవరకు నమోదవుతున్నాయి. శనివారం సాయంత్రం యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రానికి వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఎండ తీవ్రతకు జనం కొంత ఉపశమనం పొందినప్పటికీ రైతులకు మాత్రం కొంత నష్టం వాటిల్లింది.

అకాల వర్ష బీభత్సం

- అరటి తోటకు తీవ్ర నష్టం

తాళ్లూరు : కొత్తపాలెంలో గాలివానకు ఒరిగిన చెట్లు

విశాలాంధ్ర-తాళ్లూరు : ఆదివారం సాయంత్రం మూడు గంటల వరకు వేసవి తాపాన్ని చూపిస్తూ ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది. వెంటనే హఠాత్తుగా వాతావరణంలో పూర్తిగా మార్పు సంభవించింది. ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లతో కూడిన గాలి వర్షం ప్రారంభమైంది. తీవ్రంగా వీచిన గాలి తరంగాలకు మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కోటా సుబ్బారెడ్డికి చెందిన మూడు ఎకరాల విస్తీర్ణంలో అరటి తోట తీవ్రంగా ధ్వంసమై చెట్లు నేలకొరిగాయి. అరటి తోట ఏపుగా పెరిగి పంట చేతికందే సమయంలో అకాల గాలి వర్షానికి చెట్లన్నీ నేలకొరకడంతో రైతు కళ్ళల్లో కన్నీళ్లు ఒలికాయి. వడగండ్ల ఆరుగాలం కష్టించి పంట చేతికందే సమయంలో చెట్లన్నీ నేలకొరకడంతో లక్షలాది రూపాయల నష్టాన్ని ఆ కుటుంబం అనుభవించవలసి వచ్చింది. ప్రభుత్వం స్పందించి అరటి రైతును ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని గ్రామ రైతులు వైసీపీ నేతలు కోరుతున్నారు.

వడగండ్ల వాన- బాలికకు గాయాలు

మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సాయంత్రం వడగండ్లతోకూడిన వర్షం కురిసింది. ఒక మోస్తరు లావుపాటి రాళ్ల లాంటి వడగండ్లతో కూడిన వర్షం గతంలో ఎన్నడూ లేని విధంగా కురవడంతో ప్రజలు ఆశ్చర్య చకితులయ్యారు. మండలంలోని నాగంబొట్లవారిపాలెం గ్రామంలో వడగండ్లను ఏరుకోవడానికి వెళ్లిన బాలికకు తలపై వలగండ్లు పడడంతో గాయాలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రంగా వడగండ్లు పడడం, ఒక మోస్తరైన వర్షం కురవడంతో వేసవిలో ఇలాంటి వర్షాలు కురవడం ఏమిటని ప్రజలు ఆశ్చర్య చకితులవుతున్నారు.

మోస్తరు వర్షంతో సేద తీరిన ప్రజలు

వడగండ్ల వానతో తడిసి ముద్దయిన ముండ్లమూరు

ముండ్లమూరులో వడగండ్ల పడుతున్న దృశ్యం

వర్షం దాటికీ మిర్చిపై పరదాలు కప్పిన రైతులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండు వేసవిలో వడగండ్ల వానతో ముండ్లమూరు మండలం తడిసి ముద్దయింది. మండలంలోని ముండ్లమూరు, పసుపుగల్లు, ఉలగల్లు, పులిపాడు, రమణారెడ్డిపాలెం, వేముల, తమ్మలూరు, ఉమామహేశ్వరపురం, నాయుడుపాలెం, మారెళ్ళ, మక్కినేనివారిపాలెం, వేంపాడు, శంకరాపురం, సింగనపాలెం, పూరిమెట్ల, భీమవరం, ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పసుపుగళ్ళు, ముండ్లమూరు తమ్మలూరు, నాయుడుపాలెం, ఉమామహేశ్వరరావు, సుంకరవారిపాలెం, మిర్చి పంట రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలను కాపాడుకునేందుకు పొలాలకు పరుగులు పెట్టారు. అప్పటికే కొంత మేర ఎండు మిరపకాయలు నాయుడుపాలెం గ్రామానికి చెందిన పుచ్చా రవీంద్రారెడ్డికి చెందిన మిరపకాయలు తడిసిపోయాయని రైతులు ఆవేదన చేస్తున్నారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం దాటికి వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. గంట పాటు వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండలకు వర్షం పడడంతో చల్లగా ఉండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను, అక్కడ చదివిని తీరు తెన్నులను, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం టీచర్లతో వ్యవహరించిన తీరును గుర్తు చేసుకున్నారు. ఈ మొదటి సమావేశంలో పాఠశాలకు ఏదైనా చేయాలని ఉద్దేశంతో మరో తరుణంలో పాఠశాల విద్యార్థులకు ఏదైనా అందించాలని ఉద్దేశంతో కార్యాచరణ తీసుకున్నామని పూర్వ విద్యార్థులు చొప్పర శ్రీనివాసులు విద్యార్థి తెలియజేశారు. ఈ సమ్మేళనంలో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల ఆటలు, పాటలతో శ్రీనివాస కళ్యాణం మండపంలో కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగులు ఇంక మోసపోరు

వినుకొండ రాజారావు

విశాలాంధ్ర-ఒంగోలు : ఉద్యోగుల హక్కులను కాపాడుతామని, కావలి కాస్తామని చెప్పి ఉద్యోగుల హక్కులతో ఆడుకున్న నాయకులకు ప్రభుత్వం ఒడిలను, బదిలీలలో వెసులుబాటును ప్రభుత్వ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజారావు మాట్లాడుతూ ఉద్యోగ సంఘ నాయకులు సాధించింది చెప్పలేక సతికిలబడి, మరలా ఇప్పుడు కొన్ని సంఘాలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, మరోవైపు ప్రభుత్వానికి డెడెలైన్స్ విధిస్తూ నాయకత్వం నిలుపుకోవడానికి అనేక ఫీట్లు పాట్లు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు విజయేందర్ రావు, శ్రీనివాసులు, మురళి,సుదర్శన్ రావు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో వర్షం

విశాలాంధ్ర-పామూరు :
పట్టణంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలి, వడిగండ్లతో భారీ వర్షం కురిసింది. విద్యుత్ అంతరాయం కలగడంతో పట్టణ శివారు ప్రాంతాలు కటిక చీకటితో జలమయమయ్యాయి.

ముత్తుములకు సన్మానం

విశాలాంధ్ర-గిద్దలూరు :
పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డిని గిద్దలూరు పట్టణం, నల్లబండబజారులోని బుడగ జంగం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వచ్చే మే నెల 1వ తేదీ నుండి 3 వ తేదీ వరకు జరగనున్న శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయవలసినదిగా ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతలపూరి బాలరాజు, బుడగజంగం సభ్యులు గంజాయి రాముడు విబుది జమ్మయ్య, విబుది మౌలాలి, చౌడయ్య, యల్లప్ప, శంకర్, జమ్మయ్య దుబాయ్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

విశాలాంధ్ర-ఒంగోలు :
వైయస్సార్సీపి అవినీతి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఒంగోలు నియోజకవర్గం లోని క్లస్టర్ ఇంచార్జిలతో సమావేశాన్ని ఆదివారం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ క్లస్టర్ ఇంచార్జి లకు దిశా నిర్దేశం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రజల్లోనికి తీసుకొని వెళ్లడం ద్వారా జగన్మోహన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు తెలియజేసి, వారికి అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని పట్టణ, గ్రామాలలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. నగరం మరియు గ్రామాలలో స్థానికంగా ఉన్న సమస్యలపై తెలుగుదేశం పార్టీ నాయకులు పోరాటం చేయాలని అన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ నేటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రజల పక్షాన పోరాటం చేయాలన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు వినకొండ సుబ్రహ్మణ్యం, కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, ద్వారాబాకుల శ్రీనివాసులరెడ్డి, జంపాణి రామచంద్ర గౌడ్, పోలవరపు వెంకట రామయ్య, షేక్ కపిల్ బాషా, బండారు మదన్, దాయినేని ధర్మ, వేమూరి వెంకటేశ్వర్లు, కమ్మ వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వరడ్డి, జూటూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన బాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలు సందర్భంగా శుక్రవారం మార్కాపురం పట్టణంలోని జరుగుతున్న అన్నదాతల ఆత్మీయ సమావేశానికి విజయభేరి కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కూరాకు బాల నారాయణ యాదవ్ మరియు వారి కుమారుడు హర్షవర్ధన్‌లు కలసి చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఆ చిన్నారి హర్షవర్ధన్‌తో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ బాగా చదువుకొని మీ నాన్నకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకవచ్చి సమాజానికి సేవ చేయాలని ఆశీర్వదించడం జరిగింది. అలాని శభాష్ హర్షవర్ధన్ అని తన ఆప్యాయతను తెలియజేశారు.

చంద్రబాబుతో గాయం కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మార్కాపురం పట్టణంలోని మూడు రోజులపాటు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మార్కాపురం పట్టణంలోని జరిగిన అన్నదాతల ఆత్మీయ సమావేశానికి విజయభేరి కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు టీడీపీ మండల యువ నాయకులు గాయం కృష్ణారెడ్డి (శ్రీరామ ఎర్త్ మూవర్స్), నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దళిత ద్రోహి మంత్రి ఆదిమూలపు సురేష్

మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి

విశాలాంధ్ర-పామూరు : వైసీపీ ప్రభుత్వంలో దళితులపై ధమనకాండ జరుగుతున్న, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదోవ పడుతున్న నోరు ఎత్తని మంత్రి ఆదిమూలపు సురేష్ అర్ధ నగ్న ప్రదర్శనతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను

అడ్డుకోవడం కేవలం తన మంత్రి పదవి కాపాడు కోవడం కోసం, జగన్ మెప్పు పొందడానికే ఇటువంటి దిగుచ్చాకర చర్యలకు పాల్పడడం బాధాకరమని టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి అన్నారు. డోల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాస్కులు లేవని అడిగిన పుణ్యానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడని ముద్ర వేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రభుత్వ పెద్దలు ప్రేరేపించారన్నారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కడప జిల్లా పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న హత్య జరిగిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు దళిత డ్రైవర్‌ను హత్య చేసి ఇంటికి డోర్ డెలివరీ చేసినా వైసిపి నుంచి సస్పెండ్ చేయలేదన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చారన్నారు. ఇవన్నీ మంత్రికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. దళితులు హత్యలకు గురవుతున్న, ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్లించిన కనీసం నోరు మెదపని మంత్రి ఆదిమూలపు సురేష్ ఎర్రగొండపాలెంలో చంద్రబాబు రోడ్ షోను అడ్డుకోవడానికి నల్ల బెలూన్స్, ప్లే కార్డులతో రోడ్డు మీదకు రావడమే కాకుండా, చంద్రబాబు వాహనం పై రాళ్ళు వేపించడం,షర్టు ఇప్పి అర్ధ నగ్న ప్రదర్శన చేయడం మంత్రి సురేష్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. మంత్రి పదవి కోసం ప్రాకులాడుతున్న అదిమూలపు సురేష్ చరిత్రలో దళిత ద్రోహిగా నిలిచిపోతారన్నారు.

అడవి రామలింగేశ్వర స్వామి కళ్యాణ తిరుణాల ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు : కొత్తపట్నం మండలం గవ్వలపాలెం దగ్గరలో సముద్ర తీరంలో వేంచేసి ఉన్న గంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి తిరుణాల మహోత్సవం ప్రారంభమైనవి. ఈ దేవాలయం త్రేతాయుగం నాటి కాలంలో శ్రీ పరశురాములు ప్రతిష్టించారని పురాణ ఖాత చెబుతున్నది ఇక్కడి సముద్రం చాలా దగ్గరగా ఉన్నది ఈ దేవాలయంలో ఆదివారం నాడు స్వామివారికి అభిషేకాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు కొంపల్లివారి వంశస్తులు ఘనంగా నిర్వహించారు. వంశపారంపర్యంగా కొంపల్లివారి వంశస్థులు ఈ దేవాలయానికి తిరునాళ్ళు చేయడం అనువాయితీ. సోమవారం ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ కళ్యాణానికి కొత్త బట్ట మండలంలోని గుణమాల, పాదర్తి, మోటు మాల, డీడీ కాలనీ, గమల్లపాలెం, వద్దిరెడ్డిపాలెం, ఈతముక్కల మడనూరు గ్రామాలు ఉండే గాక ఒంగోలు గుంటూరు నుండి కూడా భక్తులు రావడం అనువాయితి కళ్యాణ్ అనంతరం భక్తులు సముద్రస్నానాలు చేసి వెళ్తారు. దేవస్థాన ధర్మకర్తలు కొంపల్లి వారు భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.

నష్టాల బాటలో కరివేపాకు

- ముండ్లమూరు మండలంలో 200 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 15 వేల నుండి 20 వేల వరకు ధర పతనం
- ఆంధ్రతో పాటు కర్ణాటక తెలంగాణకు ఎగుమతి

ఆశాజనకంగా ఉన్న కరివేపాకు తోట

కరివేపాకు కోస్తున్న కూలీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : వాణిజ్య వ్యాపార పంటల సాగుతో ఆటుపోట్లతో విసిగి వేసారిన రైతాంగానికి గత సంవత్సరం కాలంలో కరివేపాకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతన్నలు కరివేపాకు సాగుపై ఆసక్తి చూపారు. ముండ్లమూరు మండలంలో 200 ఎకరాల వరకు సాగు చేశారు. అయితే గత జనవరి నెలలో కరివేపాకుకు మంచి డిమాండ్ ఉండటంతో పాటు ధర ఉండటంతో మంచి మార్కెట్ ధర పలకడంతో రైతన్నలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలలో ఒక్కసారిగా ధర అమాంతం తగ్గడంతో రైతన్నలో తీవ్ర నిరాశకు లోనైనారు. వివరాల్లోకి వెళితే జనవరికి ముందు ఎకరా కరివేపాకు సాగు చేసిన రైతులకు మంచి ఆదాయం లభించడంతో రైతులు కరివేపాకు సాగుపై మొగ్గు చూపారు. ఎకరాకు విత్తనాలు క్వింటా ధర 15 వేల నుండి 30 వేల వరకు ఉంటుంది. వ్యవసాయం ఆరు నుండి ఏడు సార్లు చేస్తే, డ్రిప్ తో సహా ఎకరానికి లక్ష ఖర్చు అవుతుంది. మూడు నెలలకు ఒకసారి కోత వస్తుంది. ఇలా సంవత్సరానికి నాలుగు కోతలు దిగుబడితో ఒక కోతకు ఐదు టన్నుల లెక్కన సంవత్సరానికి 20 టన్నుల వరకు వస్తుంది. గత జనవరి నెలలో టన్ను 38వేల నుండి 40 వేల వరకు ధర పలికింది. దీంతో ఎకరానికి మూడు లక్షల నుండి నాలుగు లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఎకరానికి మొదటి సంవత్సరం పెట్టుబడి లక్ష ఉంటుంది. రెండవ సంవత్సరం 30 వేలు మూడవ సంవత్సరం 20 వేలు ఉంటుంది. ప్రస్తుతం ఏప్రిల్ నెలలో ధర అమాంతం పడిపోయి పదిహేను వేల నుండి 20వేల వరకు ధర పతనం అయింది.

ఎప్పుడు ఇంత ధర తగ్గలేదు

- మేడగం నారాయణమ్మ పసుపుగల్లు

10 సంవత్సరాల నుండి కరివేపాకు సాగు చేస్తున్నాను. జనవరి నెలలో పలికినంత ధర ఎప్పుడు చూడలేదు. ఒక ఎకరాలో సాగు మొదలుపెట్టి ఆరు ఎకరాలలో సాగు చేస్తున్న, డిసెంబరు, జనవరి నెలలో గిరాకీ ఉండడంతో టన్ను 38 వేల నుండి 40 వేల వరకు పలికింది. ఇదే ధర ఉంటే ఎకరాకు పెట్టుబడి పోను 3 లక్షల నుండి నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఉన్నట్టుండి ఏప్రిల్ నెలలో టన్ను కరివేపాకు రెండు వేలకు ధర పతనమైంది. దీంతో ఒక్కోసారి వ్యాపారాలు అడగడం లేదని రైతులకు తెలుపుతున్నారు.

నష్టాల బాటలో ఉన్నాం

మేడగం జయరాంరెడ్డి, పసుపుగల్లు

నాలుగు ఎకరాల్లో కరివేపాకు సాగు చేశా అధికారులు సూచనలు సలహాలతో మెలుకువలు పాటిస్తూ వ్యవసాయం చేస్తున్నను. వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ధర పతనంతో గిట్టుబాటు ధర తగ్గింది. జనవరిలో నెలలో పలికిన ధర లేకపోవడంతో రైతులు నష్టాల బాటలో ఉన్నారు. సాగు చేసిన కరివేపాకు ఇతర రాష్ట్రాలకు వెళుతుంది. నేడు అడిగేవారే కరువయ్యారు. టన్ను 2000 ధర ఉండటంతో రైతులు నష్టాల బాటలో పయనిస్తున్నారు.

నాగం వెంకట్రావును పరామర్శించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలోని కొండారెడ్డిపల్లి గ్రామం బిసి కాలనీకి చెందిన నాగం వెంకట్రావు ఇటీవల మార్కాపురం శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్న తరుణంలో కాలికి బలమైన దెబ్బ తగలడం జరిగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి నాయకులు హుటాహుటిన యూనిట్ క్లస్టర్ కుందురు కాశిరెడ్డి, మేకల అచ్చిరెడ్డి, మేకల రాజు, కిరణ్, నాగం వెంకటేశ్వర్లు తదితరులు కొండారెడ్డిపల్లిలోని బిసి కాలనీలోని వెంకట్రావు స్వగృహానికి వెళ్లి పరామర్శించి కార్యకర్తకు భరోసా కల్పించడంతో పాటు త్వరగా కోలుకోవాలని వారు కోరడం జరిగింది. దీంతో నాగం వెంకట్రావుతో పాటు ఆయన కుటుంబీకులు టిడిపి నాయకుల యొక్క మానవత్వాన్ని, స్నేహభావాన్ని, పార్టీ సాంప్రదాయాన్ని తలుచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సంకల్ప బలంతోనే ఏలూరి ప్రజాసేవ

విశాలాంధ్ర-మార్టూరు : ప్రజాసేవ చేయాలనే సంకల్ప బలంతోనే ఎమ్మెల్యే ఏలూరి రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆ సోది సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య ఆజాద్‌లు అన్నారు. ఆదివారం పెద్దగంజాం గ్రామంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రీ గ్రూప్, ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అందత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.

చీమకుర్తిలో ప్రగడ కోటయ్య విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఆవరణలో చేనేత బందు రాజ్యసభ సభ్యులు కీ.శే ప్రగడ కోటయ్య విగ్రహ ఆవిష్కరణ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి చేతులమీదుగా జరిగింది. అనంతరం జరిగిన బహిరంగ సభకు విగ్రహ కమిటీ అధ్యక్షులు కొండా వెంకట మోహన రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి హాజరైనారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై అనాడు రాజ్యసభలో ప్రగడ కోటయ్య చేయించిన చట్టాలే నేడు చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలుచేస్తున్నది, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఉన్న చేనేత సొసైటీల స్థాపనకు అధ్యుడు ప్రగడ కోటయ్య అని చేనేత రంగానికి చేనేత కార్మికులకు ఆప్కో సమస్త ద్వారా కొనుగోళ్లను ప్రారంభించిన మహోన్నత వ్యక్తి ప్రగడ కోటయ్య అని కొనియాడారు. జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ పద్మశాలియులకే కాక చేనేత రంగం మీద ఆధారపడిన ప్రతి కార్మికనికి ప్రత్యేక గుర్తింపు కార్డులను మరియు ఫెంక్షన్ పథకం ఆనాడే ప్రభుత్వం పోరాడి అమలు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుంది అన్నారు. ప్రత్యేక అహ్వానితులుగా ప్రగడ కోటయ్య కుమారుడు ప్రగడ వెంకట శేషశయన్‌రావు వారి సతీమణి హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ బడిగించల చంద్రమౌళి, రాష్ట్ర విద్యుత్ శాఖ సలహా మండలి సభ్యులు పంచుమర్తి లక్ష్మి భీమేష్, ప్రగధ కోటయ్య అనుచరులు ఆకురాతి మురళీకృష్ణ, ప్రగధ కోటయ్య శిష్యులు దామర్ల శ్రీకృష్ణ, చీమకుర్తి చేనేత సొసైటీ అధ్యక్షులు అవ్వారు ఆదినారాయణ, గోలి ప్రభాకర సిద్ధాంతి, ఈ కార్యక్రమంలో కవర్తపు రాఘవరావు, తాటికొండ వెంకట సుబ్బారావు, దోమల పుల్లయ్య,మర్రి లక్ష్మీనారాయణ,దొంతు వెంకటరావు, ఇష్టంశెట్టి హనుమంతరావు,నలుమోలు హరి ప్రసాదరవు, గోపవరపు పూర్ణచంద్రరావు, సోమా శేషాద్రి,పరాల శ్రీనివాసరావు, గుద్దంటి శ్రీనివాసరావు, నూకల రాఘవ,సోమా యానాదిశెట్టి,పల్లా గోపాల్, దొంతు సోమయ్య, అనుముల శ్రీనివాసరావు, కోటా కిశోర్, దొంతు యాదగిరి, పుత్తూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సీనియర్ నేత ఆకుల పిచ్చయ్య మృతి

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని నర్సిరెడ్డిపల్లికి చెందిన యూటిఎఫ్ సీనియర్ నాయకులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆకుల పిచ్చయ్య ఆదివారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వి. వీరారెడ్డి, కంభం మండల ప్రధాన కార్యదర్శి కోలా సునీల్, బెస్తవారిపేట మండలం విద్యాశాఖ అధికారి జింకా వెంకటేశ్వర్లు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అంబర్పేట్ శంకర్‌ను కలసిన తాళ్లూరు వైసీపీ నేతలు

విశాలాంధ్ర-తాళ్లూరు : దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరులు తాళ్లూరు మండల వైసిపి ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్ర, జడ్పిటిసి మారం వెంకటరెడ్డి తదితరులు ఆదివారం హైదరాబాదులో పర్యటించారు. వారు అంబర్పేట్ శంకర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తదుపరి తాళ్లూరు మండల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మూలంరెడ్డి అంజలి ప్రసాద్‌రెడ్డి, దర్శి మండల వైసీపీ నాయకులు గంగిరెడ్డి యల్లమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరి బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కనిగిరి : బిజెపిని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ రోడ్డులో నిర్వహించే ప్రచారభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ కనిగిరి మండల కార్యదర్శి జిపి రామారావు, సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ నాయకులు పిసికేశవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిపి రామారావు మాట్లాడుతూ కేంద్ర మతోన్మాద మోడీ ప్రభుత్వము కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, సామాన్య మధ్యతరగతి ప్రజలకు ప్రతిబంధంగా మారిందన్నారు. దేశ స్వాతంత్రాన్ని రాజ్యాంగా విలువలను కాపాడుకునే సమయం ఆసన్నమైందన్నారు. కావున కేంద్రం మద్దతుతో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. ఈ సమావేశంలో వామపక్షర పార్టీల నుంచి రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

రాములవారి కళ్యాణంలో పాల్గొన్న ఉగ్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని కూటాగుండ్ల పంచాయతీలోని చిన్న మల్లవరం గ్రామంలో ఆదివారం శ్రీ రాముల వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని రాములవారికి కర్పూర హారతులు ఇచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, కోటపాటి శేషయ్య, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, కూడలి దశరథ, గాయం కృష్ణారెడ్డి, ఎస్వీఆర్ మరియు ఆ గ్రామ ప్రజలు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

విశాలాంధ్ర-కంభం : కంభం మండలం జంగంగుంట్ల సమీపంలో ఆదివారం ఉదయం నేషనల్ హైవే 544డిలో బైక్‌ను వెనకనుండి కార్ బలంగా ఢీ కొట్టింది. బైక్ పై ఉన్న ఇద్దరు క్రింద పడ్డారు. సుభానికి తలకు బలమైన గాయం కావడం వలన చనిపోయాడు. మరొకరికి గాయాలు అయ్యాయి. ఇద్దరు కంభం వాసులే వీళ్లు కంభం నుండి మార్కాపురానికి పనిమీద వేలుతుండగా ఈరోడ్డు ప్రమాదం జరిగింది. మృతుడు షేక్ సుభాని (38) సంవత్సరాలు కంభం హీరో షోరూంలో బైక్ మెకానిక్‌గా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఇప్పుడు ఇతని కుటంబానికి దిక్కు ఎవరు. గాయాలైన వ్యక్తి షేక్ సుభానీని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారును నిర్లక్ష్యంగా నడపడం వలన ఈ ప్రమాదం జరిగింది.

జూవెలరీ షాప్ ప్రారంభం

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రంలోని టంగుటూరులోని సింగరాయకొండ వెళ్లే ట్రంక్ రోడ్‌లోని కీర్తి మెడికల్ షాప్ పక్కన నూతనంగా జువెలరీ షాప్ ప్రారంభానికి డాక్టర్ సునీత, రిటైర్డ్ ఎస్పి ఈశ్వరరావు షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమం కే హరికృష్ణ సంస్థ నిర్వాహకులు అజిత్ బాబు, సురేంద్రనాథ్, ఆదాయపన్ను శాఖ అధికారి కురుగుంట్ల సిల్వర్ రాజ్ స్థానికులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లే పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి

ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : వేసవి సెలవుల తరుణంలో పిల్లలు, యవకులు గ్రామాలు, పట్టణాల శివారులో కుంటలు, చెరువుల్లో, కాలువల్లోకి ఈతకి వెళ్లి మృత్యువాత పడి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారని జిల్లా ఎస్పీ ఆవేదన వ్యక్తం చేసారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న, చిన్నారులు విద్యార్థులు యువకులు సరదా కోసం చెరువులు, కాలువలు, బావులకు ఈతకు వెళ్లి ప్రాణాలు మీదకి తెచ్చుకోవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెరువులు, కొలనులు, జలపాతాలు, నీటి కుంటలు, ఏరుల వద్దకు ఈతకు వెళ్లకుండా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెరువుల, బావులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులను, లోతును తెలిపే ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట ముళ్ల కంచె లాంటివి ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తెలియచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈత కెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొకపోతే సరదామాటున పిల్లల విలువైన ప్రాణాలు పోయే పరిస్థితి ఉన్నదని, వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని, పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులకు ఈతరాకపోతే కలిగే ప్రమాదాల గురించి వివరించాలని ఎస్పీ కోరారు. జలాశయాలు, బావులు, కాలువలు, చెరువులు, కుంటల్లో ఈత కొట్టేముందు ఈత వచ్చిన వాళ్ళు సైతం వాటి లోతు ఎంత అనే విషయం కర్రల సాయంతో చెక్ చేసుకోవాలని, నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటే ఈతకు వెళ్లరాదని, విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లిన సమయంలో లోతు తక్కువ ఉన్న చోటే స్నానం చేయాలే తప్ప లోపలికి వెళ్లరాదని, మద్యం మత్తులో నీటిలోకి దిగే ప్రయత్నం చేయటం మంచిది కాదని, ఈత రాకున్నా స్నేహితులు బలవంతం చేయరాదని ఎస్పీ మలిక గర్గ్ సూచించారు.

అభ్యుదయ సాహిత్యానికి సామాన్యుడే కథానాయకుడు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : అభ్యుదయ సాహిత్యానికి సామాన్యుడే కథానాయకుడు అని ప్రముఖ అభ్యుదయ కవి, సాహిత్య విమర్శకులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్.వి. సత్యనారాయణ అన్నారు. ప్రకాశంజిల్లా రచయితల సంఘం పూర్వాధ్యక్షులు భీమనాధం హనుమారెడ్డి 82వ జయంతి వేడుకలలో ఆయన అభ్యుదయ సాహిత్యం నాడు- నేడు అనే అంశంపై ప్రసంగించారు. అభ్యుదయ సాహిత్యానికి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు మూలపురుషులని అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ నినదించారు అని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో కూడా మాకొద్దీ తెల్ల దొరతనం అని అభ్యుదయ కవులు ఆంగ్లేయులపై పోరాటం చేశారని అన్నారు. అనంతరం ఎస్వి సత్య నారాయణకు భీమనాధం హనుమారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం 2023ను ప్రదానం చేశారు.

అవార్డు కింద పదివేల రూపాయలు నగదును బహూకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో తెలుగు డిపార్మెంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అన్న నల్లూరు వెంకటేశ్వర్లు, సంతపేట సాయిబాబా మందిరం అధ్యక్షులు అలహరి చెంచలరావు, నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎ.జయప్రకాష్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ప్రరసం ప్రధాన కార్యదర్శి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాత్తపు కొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. హనుమాన్‌రెడ్డి ఆత్మీయ పురస్కారాలను ప్రముఖ కవులు డాక్టర్ యు. దేవపాలన, కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వివి శేషయ్య, బీనీడి కృష్ణయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, వి. ఝాన్సీదుర్గలకు ప్రధానం చేశారు. ముందుగా జరిగిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవులు గాడేపల్లి దివాకర్ దత్తు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మూడుమంచు వెంకటేశ్వర్లు, కె.వి.ఎస్. ప్రసాద్, పాలూరి శివప్రసాద్, గంగిసెట్టి నరసింహారావు నరసింహారావు, కె.వి.రమణారెడ్డి, రఫీ, వడలి రాధాకృష్ణ, ఆవుల వెంకటరమణ పాల్గొని కవిత గానం చేశారు. కవులను ఘనంగా సత్కరించారు.

జ్వాలాముఖి దేవస్థానంలో వైభవంగా పూజలు

విశాలాంధ్ర-ఒంగోలు : మడునూరు గ్రామంలో వెలిసిన జ్వాలాముఖి అమ్మవారికి ఆదివారం నాడు అత్యంత వైభవంగా కుంకుమ పూజలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మడనూరులోని అగ్నిలో వెలిసిందని పూర్వకాలం నుండి చెప్పుకుంటుంటారు. పూర్వం ఒంగోలు, పెళ్లూరు రాజులుకు, వైరం ఏర్పడిన సందర్భంగా బలవంతులైన ఒంగోలు రాజులను ఓడించేందుకు పెళ్లి రాజులు ఈత మడనూరు గ్రామంలోని తోటలో బరూరు వెంకట శర్మ అనే ఆధ్వర్యంలో పెద్ద హెూమాన్ని నిర్వహించారు. ఆ హెూమం నుండి అమ్మవారి వెలిసింది కావున అగ్నిజ్వాల నుండి పుట్టింది కాబట్టి జ్వాలాముఖి అని అగ్ని యొక్క ఉల్కల నుండి పుట్టిన అమ్మవారికి ఉల్కాముకి అని అదే కాలక్రమేనా వల్లూరమ్మగా పేరు కానించిందని చరిత్ర చెబుతోంది. నిన్న అక్షయ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు నేడు కూడా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు పూజలు కుంకుమార్చనలు ఆలయ పూజారి జూటరి కృష్ణమూర్తి నిర్వహించారు. ఆయన సహాయకులుగా నాగ సాయి ప్రద్యుమ్ ఉన్న ఉన్నారు. వేలాది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ప్రతి ఆదివారం అమ్మవారి పుట్టిన మడనూరు లోనూ ఆమె ఆగిన ప్రదేశం ఈతముక్కల్లోనూ ప్రత్యేక పూజలు జరుగుతూ ఉంటాయి. ఇతర గ్రామస్తులకు అన్నదానం చేశారు.